


నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
శనివారం
20-06-2026 సంపుటి : 01 సంచిక : 89 పేజీలు : 08 వెల : ₹ 5/-




Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



# నీట్ రీ ఎగ్జామ్ యథాతథం

## స్టే ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

- టెలిగ్రామ్ యాప్ నిషేధానికి ఓకే
- కేంద్ర నిర్ణయానికి ఢిల్లీ హైకోర్టు మద్దతు
- అడ్మిట్ కార్డులపై ఎన్టీఏ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పరీక్షల వివాదంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21న జరగబోయే 'నీట్' రీ ఎగ్జామ్ కు కేవలం 1 రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో.. పరీక్షకు సంబంధించిన పలు పిటిషన్లను అత్యవసరంగా విచారించేందుకు అత్యున్నత ధర్మాసనం నిరాకరించింది. అయితే, జూన్ 21న జరగనున్న నీట్ టెస్టును నిలిపివేయాలని, వాయిదా వేయాలని కోరుతూ పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలయ్యాయి. -మిగతా 3 లో



## భూవివాదాలు లేని తెలంగాణ
# నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్రంలో దశల వారీగా భూముల రీసర్వే
- వచ్చేనెల నుంచి తొలిదశలో 2240 గ్రామాల్లో ప్రారంభం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ జూన్ 19 (మహాప్రభ)**
భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం -మిగతా 3 లో

## పాఠశాలల్లోనే
# దేశ భవిష్యత్

## కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

- ఎల్బీ స్టేడియంలో 'యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్స్' పంపిణీ
- విద్యాశాఖ బాధ్యతలు నా సొంత పర్యవేక్షణలోనే..
- గత పాలకుల నిర్వాకంతో విద్యావ్యవస్థ తీవ్రంగా విధ్వంసం
- బడ్జెట్‌లో విద్యకు 8.5 శాతం నిధుల కేటాయింపు
- 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టే స్థాయికి సర్కారు బడులు
- ప్రతి నెలా ఒకటో తేదీనే విద్యార్థులకు కాస్మెటిక్ ఛార్జీలు
- ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్ 19 (మహాప్రభ)**
దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు.
-మిగతా 3 లో










## హైదరాబాద్‌లో జనసేన నూతన
# కార్యాలయం ప్రారంభం

- పార్టీ జెండాను ఆవిష్కరించిన పవన్ కళ్యాణ్
- మల్కం చెరువు సమీపంలో సరికొత్త ఆఫీస్
- గ్రేటర్ ఎన్నికల్లో ఒంటరిగానే జనసేన పోటీ
- క్యాడర్‌ను సిద్ధం చేసేందుకే కొత్త కేంద్రం
- త్వరలోనే పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన
- చేరికల కోసం త్వరలో 'జాయినింగ్స్ కమిటీ'
- తెలంగాణపై పొలిటికల్ రోడ్‌మ్యాప్‌తో జనసేన వ్యూహాలు

**హైదరాబాద్,జూన్ 19 (మహాప్రభ)**
హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఉఊఓఅ) ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది.
-మిగతా 3 లో



## నేడు అన్నదాత సుఖీభవ
# నిధుల విడుదల

- రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం
- 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది
- లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

**అమరావతి, జూన్ 19 (మహాప్రభ)**
రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును -మిగతా 3 లో



## కేంద్రం నిర్ణయించిన పంటలే కొంటే
# ఇక మీరెందుకు?

- రాహుల్ గాంధీ పుట్టినరోజే రైతు డిక్లరేషన్‌ను బొందపెట్టిన సీఎం
- వరంగల్ వేదికగా ఇచ్చిన బోనస్ హామీ ఏమైంది?
- రేవంత్ సర్కార్ నిర్ణయంతో దళారుల దయపై ఆధారపడాల్సిన స్థితి
- ఎకరానికి రెండు బస్తాల యూరియా మాత్రమేనా.. మంత్రులకు చిన్నచూపు!
- 45 రోజుల్లో రైతుబంధు అన్నారు.. 90 రోజులైనా అందని నిధులు
- ప్రీమియం కట్టకపోవడంతో 7,600 మందికి అందని రైతు బీమా
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు

**సిద్దిపేట, జూన్ 19 (మహాప్రభ)**
కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. -మిగతా 3 లో



# అమెరికా-ఇరాన్..చర్చలకు బ్రేక్!

- జేడీ వాన్స్ స్విట్జర్లాండ్ పర్యటన రద్దు
- రాత్రికి రాత్రే ప్రకటించిన వైట్ హౌస్
- లెబనాన్ పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- అమెరికా, ఇజ్రాయెల్ మధ్య విభేదాలు
- హిజ్బుల్లాతో ఇజ్రాయెల్ భీకర పోరాటం

**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరగాల్సిన కీలక చర్చలు హఠాత్తుగా రద్దయ్యాయి. స్విట్జర్లాండ్ లోని బర్గెన్ స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్ లో శుక్రవారం జరగాల్సిన ఈ చర్చలు నిలిచిపోయినట్లు స్విస్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనలో వెల్లడించింది. కాగా, అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ తన స్విట్జర్లాండ్ పర్యటనను రద్దు చేసుకున్నట్లు వైట్ హౌస్ ప్రతినిధి రాత్రికి రాత్రే ప్రకటించడంతో ఈ చర్చలు నిలిచిపోయాయి. అమెరికా-ఇరాన్ -మిగతా 3 లో

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం
# గ్రీన్ సిగ్నల్

### అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ

- రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

**హైదరాబాద్ జూన్ 19 (మహాప్రభ)**
తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.
-మిగతా 3 లో





## ఎన్నికల హామీలను
# విస్మరించిన కాంగ్రెస్

- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,జూన్ 19 (మహాప్రభ)**
:రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ -మిగతా 3 లో


# నిందితుల్ని వదిలిపెట్టం..



3 లో

# టెలిగ్రామ్ యాప్‌పై తాత్కాలిక బ్యాన్..

**కేంద్ర నిర్ణయాన్ని సమర్థించిన ఢిల్లీ హైకోర్టు**




**న్యూఢిల్లీ జూన్ 19 (మహాప్రభ)**
నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్ ను తాత్కాలికంగా కేంద్రం బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర నిర్ణయాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకున్నట్లు హైకోర్టు చెప్పింది. టెలిగ్రామ్ యాప్ కేసులో జస్టిస్ తేజస్ కరియా తన తీర్పును వెలువరించారు. సెక్షన్ 69ఏ కింద ప్రభుత్వం టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌ను బ్యాన్ చేసిందని, ఆ యాప్‌ను బ్యాన్ చేయడానికి గల కారణాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ప్రభుత్వం రక్షణాత్మక చర్యలు తీసుకున్నదని, కేంద్రం ఇచ్చిన ఆదేశాలు అసమతుల్యంగా ఉన్నట్లు భావించలేమని ఢిల్లీ హైకోర్టు చెప్పింది.తాత్కాలిక బ్యాన్ కోసం ప్రభుత్వం సమర్పించిన కారణాలు సరిపోతాయని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ యాప్‌పై బ్యాన్ తప్పదని, ఐటీ చట్టంలోని 69ఏ సెక్షన్ ప్రకారం ప్రభుత్వం యాప్‌ను బ్లాక్ చేసిందని కోర్టు పేర్కొన్నది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించేందుకు అన్ని కారణాలు ఉన్నాయని జస్టిస్ తేజస్ అన్నారు. కేంద్రం అనాలోచితంగా ఆదేశాలు ఇవ్వలేదని, ఐటీ చట్టం ప్రకారమే ఆ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు తెలిపింది. ప్రశ్నాపత్రాల పేపర్లను లీకేజ్ చేసి..కొన్ని ముఠాలు చీటింగ్‌కు పాల్పడుతున్నాయని, కొందరు ఆ పేపర్లను టెలిగ్రామ్ యాప్ ద్వారా కూడా షేర్ చేసుకున్నట్లు కోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో నీట్-రీఎగ్జామ్‌ను దృష్టిలో పెట్టుకుని, టెలిగ్రామ్ యాప్‌ను జూన్ 22వ తేదీ వరకు కేంద్రం బ్లాక్ చేసింది. ఇక జూన్ 30వ తేదీ వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను డిజైబుల్ చేసింది. దేశంలో ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు స్వేచ్ఛగా ఆపరేట్ చేస్తుండగా, కేవలం తమపై ఎందుకు బ్యాన్ విధించారని టెలిగ్రాం యాప్ కేంద్ర ఆదేశాలను సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్లింది. జూన్ 21వ తేదీన నీట్ రీ-ఎగ్జామ్‌ను నిర్వహించనున్నారు.

# యాక్సెంచర్ షాక్..

**- కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు..**
**- 1.35 లక్షల కోట్లు ఆవిరి**




**ముంబై: జూన్ 19 (మహాప్రభ)**
భారతీయ ఐటీ దిగ్గజ కంపెనీలు అనూహ్యమైన షాక్‌కు గురయ్యాయి.సుమారు 1.35 లక్షల కోట్ల విలువైన స్టాక్స్ కుప్పకూలినట్లు తెలుస్తోంది. గ్లోబల్ ఐటీ కన్సల్టెన్సీ యాక్సెంచర్ కంపెనీ ఇచ్చిన రెవన్యూ రిపోర్టు.. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్రంగా షేక్ చేసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల స్టాక్స్ దారుణంగా పడిపోయాయి. ఇన్ఫోసిస్ కంపెనీలో 8.5 శాతం ట్రేడింగ్ తగ్గిపోయింది. స్టాక్ ఎక్స్‌చేంజ్ ట్రేడింగ్‌లో ఇవాళ ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 8.59 శాతం, టెక్ మహేంద్ర షేర్లు 7 శాతం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం పడిపోయాయి.యాక్సెంచర్ ఇచ్చిన ఆదాయ రిపోర్టు నేరుగా భారతీయ ఐటీ కంపెనీల స్టాక్స్‌పై ప్రభావం చూపింది. కృత్రిమ మేధ వల్ల వృద్ధి తగ్గనున్నట్లు ఇటీవల యాక్సెంచర్ కంపెనీ తన ఆదాయ రిపోర్టును అంచనా వేసింది. ఆ నివేదిక ఇప్పుడు భారతీయ ఐటీ కంపెనీల్లో వణుకు పుట్టించింది. శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ ఒక్కసారిగా కుదేలైంది. టెకీ ప్రాజెక్టుల కోసం ఎక్కువగా ఇండియన్ కంపెనీలన్నీ యాక్సెంచర్ సంస్థపైనే ఆధారపడడం వల్ల.. యాక్సెంచర్ ఇచ్చిన రిపోర్టు భారత ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. యావత్ ఐటీ రంగానికి యాక్సెంచర్ వార్నింగ్ ఇవ్వడంతో.. పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను తీసేసుకుంటున్నట్లు బజాజ్ బ్రోకింగ్ నిపుణుడు శశ్వంత్ సింగ్ తెలిపారు. గత అయిదు రోజుల నుంచి దూకుడును ప్రదర్శించిన స్టాక్ మార్కెట్లు ఇవాళ అనూహ్య రీతిలో స్పందించాయి. సెన్సెక్స్, నిఫ్టీల్లో ట్రేడింగ్ అకస్మాత్తుగా పడిపోయింది. యాక్సెంచర్ ఇచ్చిన గైడెన్స్ సందేశం. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్ర భయాందోళనల్లోకి నెట్టేసినట్లు జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు.

## ఇరాన్ నౌకలకు లైన్ క్లియర్..

**- ఆంక్షలు ఎత్తివేసిన యూఎస్**



**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంతో హార్ముజ్ జలసంధి లో ఇరాన్ నౌకలకు లైన్ క్లియర్ అయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ ఓడరేవుల వద్ద విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేసినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఇరాన్ షరతులకు అంగీకరించడంతో ఎత్తివేసినట్లు ఈ మేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది.దీంతో అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. అయితే ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి అమెరికా యుద్ధనౌకలు ఆ ప్రాంతంలో ఉంటాయని ఇరాన్ నౌకలకు ఎలాంటి ఆటంకం కలిగించవని సెంటకామ్ పేర్కొంది. హార్ముజ్‌లో నౌకల రాకపోకలకు లైన్ క్లియర్ అవడంతో 12.5 మిలియన్ బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని వైట్ హౌస్ మీడియా సమావేశంలో ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ తెలిపారు. అలాగే ఈ జలసంధి గుండా వెళ్లాలనుకునే నౌకలకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూస్తామని, అయుద్ధ సమయంలో జలమార్గంలో అమర్చిన మందుపాతరలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటా మని ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం తర్వాత ఇరాన్ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చింది. అమెరికా నిబంధనలు ఉల్లంఘించినా లేనిపోని ఆంక్షలు విధించినా తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ హెచ్చరించారు

## దోమ సైజులో డ్రోన్

**చైనా సరికొత్త ఆవిష్కరణ**



**బీజింగ్,జూన్ 19 (మహాప్రభ)**
కొత్త రకమైన టెక్నాలజీలతో దూసుకుపోతున్న చైనా మరో ఆవిష్కరణ చేసింది. చైనా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ తాజాగా దోమ సైజులో స్పై డ్రోన్ ను రూపొందించింది. ఇది చూడటానికి అచ్చం దోమలాగే ఉంటుంది. కాకపోతే దీన్ని అనేక రకాల సర్వైలెన్స్, స్పై ఆపరేషన్లలో వాడొచ్చని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. దీన్ని 0.3గ్రాముల బరువుతో, టినీ కెమెరాలు, సెన్సార్లతో డిజైన్ చేశారు.ఇది అన్ని రకాల ఫొటోలు తీయడం, వాయిస్ ను రికార్డు చేయడంతో పాటు డాటాను సేకరిస్తుంది. కాకపోతే ఇది పెద్ద బ్యాటరీలను మోయలేదు కాబట్టి గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించలేదు. ఎలాంటి బరువులను కూడా మోసుకెళ్లలేదు. కేవలం టెక్నాలజీ పరమైన అవసరాల కోసం దీన్ని వాడొచ్చని, ఇప్పటికీ కొన్ని టెక్నికల్ పరమైన సమస్యలు ఉన్నాయని అధికారులు తెలియజేస్తున్నారు.

## పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

**వాట్సాప్ ద్వారా సచారం తెలుసుకునే వీలు**
**నీట్ విద్యార్థులకు ఎన్‌టీఏ కీలక సమాచారం**




**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్ఎమ్ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

## యోగాతో వీర్యం నాణ్యత మెరుగు..

**-ఎయిమ్స్ నిపుణుల పరిశోధనలో వెల్లడి**



**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
యోగాతో పురుషుల్లో వీర్యం నాణ్యత పెరుగుతుందని, వంధ్య త్వం ఉన్న వారిలో డీఎన్ఏను ధ్వంసం కాకుండా నిరోధిస్తుందని ఎయిమ్స్ పరిశోధకులు కనుగొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పరిశోధన వివరాలను యోగా ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురించారు. పురుషుల్లో పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా ప్రాముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఆ నివేదిక పేర్కొన్నది.ఈ పరిశోధనలో.. 12 వారాల పాటు క్రమబద్ధమైన యోగా వల్ల వీర్యంపై కలిగే ఆక్సిడేటివ్ ఒత్తిడిని, వీర్యం నాణ్యతను, డీఎన్ఏ విచ్ఛిత్తిని విశ్లేషించారు. రోజూ గంట పాటు క్రమం తప్పకుండా యోగా, శ్వాస సంబంధిత వ్యాయామాలు, ధ్యానం, విశ్రాంతి తీసుకొనే పద్ధతుల్లో పాల్గొన్న వారిలో సంతానోత్పత్తి సామర్థ్యం మెరుగుపడినట్టు కనిపించిందని వివరించారు.

## రాహుల్ గాంధీకి బర్త్‌డే విషెస్ తెలిపిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బర్త్‌డే సందర్భంగా ప్రధాని మోదీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్ గాంధీ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోదీ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేశారు. నేటి 56 సంవత్సరంలోకి అడుగుపెట్టిన రాహుల్‌కు దేశంలోని పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా రాహుల్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉంటూ ప్రజా సేవలో కొనసాగాలని ఖర్గే ఆకాంక్షించారు. కాగా, రాహుల్ గాంధీ జూన్ 19, 1970లో ఢిల్లీలోని హోలీ ఫ్యామిలీ హాస్పిటల్‌లో జన్మించారు.


# ఢిల్లీలో మహిళా పోలీస్ స్టేషన్ ప్రారంభం..

**సిబ్బంది అంతా మహిళలే**



**న్యూఢిల్లీ, జూన్ 19 (మహాప్రభ)**
ఢిల్లీలో మొదటి మహిళా పోలీస్ స్టేషన్ ప్రారంభమైంది. నార్త్ ఢిల్లీలోని సుబ్జి మండి ఏరియాలో ఏర్పాటు చేసిన ఈ మహిళా పోలీస్ స్టేషన్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందూ, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా శుక్రవారం ప్రారంభించారు. పూర్తిగా మహిళా పోలీసులు, సిబ్బందితోనే నడవడం ఈ పోలీస్ స్టేషన్ ప్రత్యేకత. పోలీస్ స్టేషన్ ప్రారంభించిన సందర్భంగా ఎల్జీ తరంజిత్ సింగ్ మాట్లాడుతూ.. మహిళలు ఫిర్యాదు చేసేందుకు, సహాయం కోరేందుకు ఈ ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు.రాబోయే రోజుల్లో ఢిల్లీ పరిధిలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిపై పోలీసు అధికారులు స్పందించారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు, వారి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టేందుకు మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. గృహహింస, లైంగిక వేధింపులు, నిఘా, దాడులు సహా మహిళలపై జరుగుతున్న అనేక నేరాలపై దృష్టి పెట్టేందుకు మంచి అవకాశం దొరుకుతుందన్నారు. నేరాల్ని అడ్డుకోవడం, విచారణ, పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. బాధితుల కోణంలో పని చేస్తామన్నారు. కేసు విచారణ జరిపే పోలీసుల దగ్గరి నుంచి సపోర్టింగ్ స్టాఫ్ వరకు మొత్తం మంది మహిళలే ఉండటం ఈ పోలీస్ స్టేషన్ ప్రత్యేకత. అధికారి స్థాయి నుంచి కింది స్థాయి వరకు సిబ్బంది అందరూ మహిళలే. ఇదే సమయంలో జనం సమస్యలు వినేందుకోసం 'జన్ సున్‌వాయి' కార్యక్రమాన్ని కూడా ఎల్జీ తరంజిత్ సింగ్ ప్రారంభించారు. ఢిల్లీ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు, వారికి సులభంగా పోలీసులు అందుబాటులో ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇక్కడ సీనియర్ ఉన్నతాధికారులు అందుబాటులో ఉండి సమస్యల్ని త్వరగా పరిష్కరిస్తారని చెప్పారు. పోలీసింగ్ కంటే, కౌన్సెలింగ్, అవేర్‌నెస్ కల్పించడమే తమ ఉద్దేశ్యమన్నారు.

## గుజరాత్‌లో భారీ అగ్ని ప్రమాదం



**హైదరాబాద్ జూన్ 19 (మహాప్రభ)**
గుజరాత్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మోర్బీ జిల్లా వాంకానేర్ ప్రాంతంలో గల మాటెల్ రోడ్డులోని ఒక పేపర్ మిల్లులో భారీగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలను ఆర్పేందుకు పలు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రస్తుతం అగ్నిమాపక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

### నేడు అన్నదాత సుఖీభవ
# నిధుల విడుదల

మొదటి తరువాయి

అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

### హైదరాబాద్‌లో జనసేన నూతన
# కార్యాలయం ప్రారంభం

మొదటి తరువాయి

రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

మొదటి తరువాయి

అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అమెరికా-ఇరాన్..చర్చలకు బ్రేక్!

మొదటి తరువాయి

ఒప్పందాన్ని విమర్శించిన ఇజ్రాయెల్ అధికారులపై జేడీ వాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో, ఇరు మిత్రదేశాల (అమెరికా, ఇజ్రాయెల్) మధ్య విభేదాలు మరింత ముదిరాయి.

లెబనాన్ వ్యాప్తంగా భీకర దాడులు..

మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ లెబనాన్ వ్యాప్తంగా తమ దళాలు రాత్రికి రాత్రే భీకర వైమానిక దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం (జూన్ 19, 2026) ప్రకటించింది. ఈ ప్రాంతంలో హిజ్బుల్లా దళాలతో తీవ్ర స్థాయిలో పోరాటం జరుగుతున్నట్లు సమాచారం.

ఇజ్రాయెల్ జరిపిన ఈ వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు లెబనాన్ ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ 'నేషనల్ న్యూస్ ఏజెన్సీ' వెల్లడించింది.

ఇరాన్ పై సముద్ర దిగ్బంధాన్ని ఎత్తివేసిన అమెరికా

ఈ ఉద్రిక్తతల నడుమే అమెరికా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ రేవులు, తీర ప్రాంతాల గుండా రాకపోకలు సాగించే సముద్ర ట్రాఫిక్ పై విధించిన దిగ్బంధాన్ని ఎత్తివేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే, అమెరికా అంతర్గత రాజకీయాల్లో రక్షణ శాఖపై ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభంలో ఇరాన్ లోని ఒక ఎలిమెంటరీ పాఠశాలపై జరిగిన ప్రాంతక దాడికి సంబంధించిన దర్యాప్తు నివేదికతో సహా, పెంటగాన్ పార్లమెంటుకు సమర్పించాల్సిన పలు కీలక నివేదికలను ఇంకా అందజేయలేదు. ఈ ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా సెనేటర్లు.. రక్షణ మంత్రి పీట్ హెగ్ సెత్ ప్రయాణ నిధులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెంటగాన్ ఆ నివేదికలను సమర్పించే వరకు ఈ నిధులను బ్లాక్ చేయాలని సెనేటర్లు ప్రయత్నిస్తున్నారు.

# మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్ యథాతథం

మొదటి తరువాయి

అయితే, పరీక్షకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయినందున, ఈ దశలో పరీక్ష ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని కోర్టు పేర్కొంది. నీట్ పరీక్షకు సంబంధించిన అన్ని పిటిషన్లు ఇప్పటికే జస్టిస్ పి.ఎస్.నరసింహ నేతృత్వంలోని బెంచ్ ముందు లిస్ట్ అయి ఉన్నాయి, కాబట్టి ఈ కొత్త పిటిషన్లను కూడా ఆ బెంచే పరిశీలిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ వివాదానికి సంబంధించిన అన్ని పిటిషన్లను ఇప్పటికే నిర్ణయించిన తదుపరి విచారణ తేదీల్లోనే క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అంతకంటే ముందే అత్యవసర విచారణ చేపట్టే ప్రసక్తే లేదని ధర్మాసనం తెలిపింది. పరీక్షకు ముందు ఇలాంటి పిటిషన్లపై విచారణ జరపడం వల్ల విద్యార్థుల్లో మరింత గందరగోళం, ఆందోళన నెలకొనే అవకాశం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ధర్మాసనం తాజా నిర్ణయంతో జూన్ 21న జరగబోయే నీట్ యూజీ ఎగ్జామ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా షెడ్యూల్ ప్రకారమే జరగనుంది.

టెలిగ్రామ్ నిషేధం సబబే.. ఢిల్లీ హైకోర్టు

నీట్ పరీక్ష నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్ పై తాత్కాలిక నిషేధం విధించడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసింది.



కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని జస్టిస్ తేజిన్ కారియా తేల్చి చెప్పారు. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అక్రమ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి టెలిగ్రామ్ ప్రధాన సాధనంగా మారిందని అన్నారు. అనుమానాస్పద ఛానల్స్ పై చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు టెలిగ్రామ్ కు సూచించామని అన్నారు. అయినప్పటికీ కంపెనీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని చెప్పారు. మరోవైపు, టెలిగ్రామ్ తరపున సీనియర్ న్యాయవాది ధ్రువ్ మెహతా వాదనలు వినిపిస్తూ ఎమర్జెన్సీ అధికారాలతో నిషేధం విధించడాన్ని కేంద్రం సమర్థించుకోలేదని అన్నారు. సంబంధిత కంటెంట్ ను మాత్రమే బ్లాక్ చేయకుండా మొత్తం యాప్ పై ఎందుకు నిషేధం విధించాల్సి వచ్చిందో వివరించలేదని పేర్కొన్నారు. కేవలం నీట్ పరీక్షతో దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందా? అని ప్రశ్నించారు. అయితే, కోర్టు కేంద్రం వాదనలను సమర్థించింది. సెక్షన్ 69ఎ కింద ఒక డిజిటల్ వేదికను నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉందని జస్టిస్ తేజిన్ కారియా స్పష్టం చేశారు. నిషేధం ఎత్తివేత కోరుతూ టెలిగ్రామ్ చేసిన అభ్యర్థనను తిరస్కరించారు.

అడ్మిట్ కార్డులు డౌన్ లోడ్ చేసుకోండి.

నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్ లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్ లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్టీఏ నుంచి ఎస్ఎంఎస్, ఈమెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డులను అధికారిక వెబ్ సైట్ నుంచి మాత్రమే డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

మొదటి తరువాయి

2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీ-సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ-సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.

# కేంద్రం నిర్ణయించిన పంటలే కొంటే ఇక మీరెందుకు?


మొదటి తరువాయి

ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయాదాక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024-25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు.

# నిందితుల్ని వదిలిపెట్టం..

**-రామభక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయొద్దు**
**- విరాళాల దుర్వినియోగంపై 'సిట్' దర్యాప్తునకు ఆదేశం**
**- ఆధారాలు ఉంటే దర్యాప్తు బృందానికి సమర్పించండి: సీఎం**
**- ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే దుష్ప్రచారాలు నమ్మకండి**
**-అయోధ్య రామమందిరం విరాళాల స్కాంపై యూపీ సీఎం యోగి వార్నింగ్**

న్యూఢిల్లీ



ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సీఎం హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు.అలాగే, ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందున్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

మొదటి తరువాయి



తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## సమగ్ర పంటల విధానమే మేలు !



దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి.

ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు.

అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ౼ాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# హైటెక్ సిటీలో అనుమానాస్పద నిర్మాణం..

**-అధికారుల పరిశీలన కోరుతున్న స్థానికులు**





**హైదరాబాద్, జూన్ 15: (మహాప్రభ)**
హైటెక్ సిటీ ప్రధాన రహదారిలోని ఎం.బి. సొసైటీ పరిసరాల్లో జరుగుతున్న ఒక నిర్మాణ పనిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్ నెం.51, ఎం.బి. సొసైటీ, హైటెక్ సిటీ మెయిన్ రోడ్, ఖానమ్మెట్ ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం, సంబంధిత నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంలో స్పష్టత లేదని, అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా లేదా అన్న అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు, ముఖ్యంగా జీహెచ్ఎంసీ మరియు టౌన్ ప్లానింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, మ్యాపులు మరియు ఇతర పత్రాలను ధృవీకరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, నిర్మాణ నిర్వాహకుల వర్గం నుంచి ఈ ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. అధికారుల విచారణ అనంతరం మాత్రమే నిర్మాణం చట్టబద్ధమైనదా కాదా అన్నది స్పష్టమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అడ్లూరి పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర విమర్శలు



**కరీంనగర్, -19జూన్ (మహాప్రభ )** ధర్మపురి నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.కరీంనగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయని, ఇసుక రీచ్‌ల వ్యవహారంలోనూ అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మంత్రి వ్యక్తిగత ఆరోపణలు, కుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజా సమస్యలపై చర్చకు రావాల్సిన కాంగ్రెస్ నాయకులు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆయన అన్నారు. ప్రజల ముందు నిజాలు చెప్పేందుకు సిద్ధమైతే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తన పదవికి రాజీనామా చేసి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.ప్రజల తీర్పుపై నమ్మకం ఉంటే పదవిని వదిలి ప్రజల్లోకి రావాలని, ఎవరు ప్రజల కోసం పనిచేశారో, ఎవరు అవినీతికి పాల్పడ్డారో ప్రజలే నిర్ణయిస్తారని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని కుల ప్రస్తావనలు చేయడం మంత్రికి తగదని, ప్రజా సమస్యలపై మాట్లాడలేని నాయకులే ఇలాంటి చౌకబారు రాజకీయాలకు పాల్పడతారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యూరియా కొరత ఆరోపణలు అవాస్తవం



**అక్కన్నపేట, -19జూన్ (మహాప్రభ )**
అక్కన్నపేట మండలంలో యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందంటూ వచ్చిన వార్తలు వాస్తవానికి విరుద్ధమని మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా స్పష్టం చేశారు.గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆమె, అక్కడ 1100 యూరియా బస్తాలు యాప్‌లో నమోదు చేసి రైతులకు పారదర్శకంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఒకేసారి రైతులు ఎక్కువగా రావడంతో క్యూ ఏర్పడిందని, దానిని కొరతగా భావించడం సరైంది కాదని వివరించారు.యూరియా విక్రయం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతోందని, బుకింగ్ ఐడీ ధృవీకరణ, ఆధార్ నమోదు, వేలిముద్ర లేదా ఓటిపి నిర్ధారణ, బిల్లు జారీ వంటి ప్రక్రియలకు సమయం పడుతుందని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయం జరుగుతోందని, అదనపు మొత్తాలు వసూలు చేయడం లేదని, ఇతర ఉత్పత్తులతో లింకేజ్ విక్రయాలు కూడా లేవని తనిఖీలో నిర్ధారణ అయిందన్నారు.యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేస్తూ, ఎరువుల విక్రయాల్లో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# బీఎల్ఏ సమావేశం విజయవంతం చేయాలని పిలుపు



**పెద్దపల్లి,-19జూన్ (మహాప్రభ )**
మంథని నియోజకవర్గంలో ఈ నెల 24న జరగనున్న బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని రాజగృహంలో మండల కోఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన, పార్టీ సభ్యత్వ నమోదు పై చర్చించారు. 24న మంథని పట్టణంలోని ఎస్ఎల్‌బీ గార్డెన్‌లో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# వైభవంగా శ్రీ మహాశక్తి దేవాలయ వార్షికోత్సవం



**కరీంనగర్, -19జూన్ (మహాప్రభ )**
: శ్రీ మహాశక్తి దేవాలయం షోడశ 16వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. జగద్గురు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం విశేష అభిషేకాలు, గణపతి పూజ, దీపారాధన, చండీ హోమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగాయి. అనంతరం పూర్ణాహుతితో కార్యక్రమం సంపన్నమైంది.ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి దేవాలయం కోరికలు తీర్చే కేంద్రం కాదు, ఆధ్యాత్మిక స్ఫూర్తి కేంద్రం అని పేర్కొన్నారు. ప్రతిరోజూ సూర్య నమస్కారం ఆచరించాలని, ఐక్యమత్యమే మహా బలం అని ఉపదేశించారు. తలకు నూనె పెట్టుకోవడం ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో వివరిస్తూ, దైనందిన అలవాట్లలో మార్పు చేసుకోవాలని సూచించారు.వార్షికోత్సవంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# బీసీ కార్పొరేషన్ రుణాలపై బీఎస్పీ ప్రశ్నలు



**హుస్నాబాద్, -19జూన్ (మహాప్రభ )**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా బీసీలకు సబ్సిడీ రుణాలు అందించడంలో విఫలమైందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విమర్శించారు.రాజీవ్ యువ వికాసం పేరిట 50 వేల నుండి 10 లక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించినా, ఇప్పటివరకు ఒక్కరికి కూడా రుణం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. జిల్లాలో లక్షలాది నిరుద్యోగ యువత దరఖాస్తులు పెట్టుకున్నా, ప్రభుత్వం భరోసా కల్పించలేదని అన్నారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లకోసారి 50 వేల రుణాలు ఇచ్చిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడం వల్ల కుల వృత్తులు అభివృద్ధి చెందడం లేదని విమర్శించారు. ప్రతి కార్పొరేషన్‌కు 1000 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలను ఆదుకోకపోతే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డేగల వెంకటేష్, దుండ్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూలిన ప్రహరిగోడ

**గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం**






**భూంపల్లి -19జూన్ (మహాప్రభ )**
భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ కు మరోసారి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నిరాశ పరిశాడు జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలకు నిధులు కేటాయించకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి జిల్లా పరిషత్ హై ప్రహరీ గోడ కూలిపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు ప్రహరీ గోడ నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన. స్థానికంగా స్పందించి బొంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రహరిగోడ లేక విష పురుగులు గేదలు ఆవులు మేకలు వస్తున్నాయని ఉపాధ్యాయులు స్థానికులు తెలిపారు. మరోసారి భూంపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ పై. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ మొండి వైఖరి. జిల్లా పరిషత్ పాఠశాలలకు నిధులు మంజూరు చెయ్యాలని గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయులు కోరగా స్థానికంగా స్పందించినా గాని పలు గ్రామాల పాఠశాలకు నిధులు మంజూరు చేసిన కానీ భూంపల్లి గ్రామానికి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు పారదర్శకంగా జరగాలి

**-అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ జూన్ 19 ( మహాప్రభ )**
2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియపై హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇండ్ల అమలు, అర్హుల ఎంపిక, ప్రభుత్వ మార్గదర్శకాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, దేవరకొండ నియోజకవర్గ పరిధిలో 226 గుడిసెలు ఉన్నట్లు అధికారులు గుర్తించారని, ఆ కుటుంబాలందరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే స్లాబ్ లేకుండా కేవలం గోడలతో ఉన్న అసంపూర్తి ఇళ్లకు పైకప్పు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులను ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అనర్హులుగా ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అర్హతల పరిశీలనను కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. మొదటి విడతలో ఎక్కడైనా సాంకేతికపరమైన లోపాలు లేదా అవకతవకలు చోటుచేసుకుని ఉంటే, రెండో విడతలో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. "అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందాలి. దేవరకొండ నియోజకవర్గంలో సొంత ఇల్లు లేని పేద కుటుంబం ఒక్కటీ మిగలకూడదు. ప్రభుత్వ విధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో ఎంపికలు జరగాలి" అని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు. పేద ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గన్యా నాయక్ తండాలో అమ్మ మాట అంగన్వాడి బాట

**-సూపర్వైజర్, డి, చిట్టెమ్మ**




**దేవరకొండ జూన్ 19( మహాప్రభ )**
శుక్రవారం దేవరకొండ మండలం గన్యనాయక్ తండా అంగన్వాడి కేంద్రం నందు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో డి చిట్టెమ్మ సూపర్వైజర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రంలో నమోదు చేయాలని అంగన్వాడి కేంద్రంలో ప్రీస్కూల్ కార్యక్రమాలు ,ఆట పాటల ద్వారా విద్య, అనుబంధ ఆహారం, గర్భిణీ స్త్రీలకు, బాలింత తల్లులకు, ప్రీస్కూల్ పిల్లలకు, ఆరోగ్య లక్ష్మి భోజనం అందించడం జరుగుతున్నదని తెలియపరిచారు.. గ్రామ సర్పంచ్ నేనవత్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ చిన్నపిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపకుండా మన గ్రామంలో ఉన్న ప్రైమరీ స్కూల్ , అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించాలని ప్రభుత్వం నుంచి అందించే పథకాలు అర్హులైన వాళ్ళందరూ అందుకోవాలని తెలియపరిచారు.. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ టీచర్ జహీరబేగం, అంగన్వాడీ టీచర్స్ సుజాత, బుజ్జి, సునీత, గ్రామ పెద్దలు, తల్లులు తదితరులు పాల్గొన్న రు.

# తూప్రాన్‌లో జూదంపై పోలీసుల ఉక్కుపాదం

**-ఎనిమిది మంది అరెస్టు**
**-రూ.10,587 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం**
**-అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది**
**- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హెచ్చరిక**





**తూప్రాన్, జూన్ 19 (మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో అక్రమ జూద కార్యకలాపాలపై పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. తూప్రాన్‌లోని గీతా స్కూల్ వెంచర్ సమీపంలో కొందరు వ్యక్తులు గుంపుగా చేరి జూదం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.10,587 నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గీతా స్కూల్ వెంచర్ సమీపంలోని ఓ ప్రాంతంలో కొందరు వ్యక్తులు బహిరంగంగా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని దాడి చేపట్టింది. పోలీసులను గమనించిన కొందరు పరారయ్యేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన వారిలో మల్లబోయిన గణేష్, ఇటుక్యాల రేవంత్ రెడ్డి, మస్కూరి రాజు, కుమ్మరి మొగిలి, చిరుమాని పరమేశ్, పైనం సాయి కుమార్, మంతూరి రాజశేఖర్, వెంచర్ల రాజు ఉన్నారు. వీరిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో జూదం, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర అక్రమ పందేల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. సమాజాన్ని తప్పుదారి పట్టించే ఇటువంటి చట్టవిరుద్ధ కార్య కలాపాలను ఎట్టి పరి స్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తున్నాయని, ఎక్కడైనా జూదం లేదా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సామాజిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. తక్షణ లాభాల కోసం కొందరు ఈ వ్యసనానికి బానిసలై కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత ముఖ్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్, క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రజలు తమ పరిసరాల్లో జూదం, బెట్టింగ్ లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తూప్రాన్ ప్రాంతంలో ఇటీవల అక్రమ కార్యకలాపాలపై పోలీసులు వరుస తనిఖీలు, దాడులు నిర్వహిస్తుండటంతో నేర నియంత్రణలో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. జూదం వంటి సామాజిక రుగ్మతలపై పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# అంకిత భావంతో పనిచేసిన విజయ్ కుమార్ మృతి బాధాకరం

**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ జూన్ 19 ( మహాప్రభ )**
దేవరకొండ పట్టణానికి చెందిన ఎన్. విజయ్ కుమార్ ఆకస్మిక మృతి పట్ల దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ( పి.హెచ్ . సి)లో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించిన విజయ్ కుమార్ మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బాలు నాయక్ నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విజయ్ కుమార్ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన మంచి ఉద్యోగి అని, ఆయన మృతి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా వైద్య శాఖకు, స్థానిక ప్రజలకు తీరని లోటని అన్నారు. విజయ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వారి వెంట దేవరకొండ ఎంపీడివో డానియల్ , సూర్య తండా సర్పంచ్ నేనావత్ కవిత - లచ్చిరాం , బంధుమిత్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# డిండి రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదల.





**-ఎమ్మెల్యే బాలు నాయక్**

**దేవరకొండ జూన్ 19( మహాప్రభ )**
ఇరిగేషన్ అధికారులతో కలిసి నీటిని విడుదల చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వానాకాలం సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో డిండి రిజర్వాయర్ నుండి ఆయకట్టుకు నీటిని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డిండి రిజర్వాయర్ నుంచి విడుదల చేసిన నీటితో డిండి మండల పరిధిలోని ఆయకట్టు ప్రాంతాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు జరగనున్నట్లు తెలిపారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలు నాయక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు

**-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**



**దేవరకొండ జూన్ 19 ( మహాప్రభ )**
తెలంగాణలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.....ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు అని ఆయన తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని ఆయన అన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు. గురుకుల విద్యాసంస్థలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది సమస్యలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను పట్టించుకోకుండా గురుకుల వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ ప్రచారాన్ని పక్కనపెట్టి విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

# గాంధారి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్




**గాంధారి, జూన్ 19: (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్, శుక్ర వారం గాంధారి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, దర్యాప్తు పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, నేరాల దర్యాప్తు విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు అడిగి వారి పనితీరును సమీక్షించారు. విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజలతో కలిసి మాట్లాడాలి, చట్ట నిబంధనల మేరకే విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వర త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని, జవాబుదారీతనంతో పనిచేయాలని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టబద్ధంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర ఐపీఎస్, పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో సీఐ సంతోష్ కుమార్, ఎస్ ఐ మహేందర్ పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఘనంగా చిన్నారులకు అన్నప్రాసన

**ఖానాపూర్, జూన్ 19 ( మహాప్రభ )**
నిర్మల్ జిల్లా పెంబి మండలం కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ మల్లెపెల్లి సత్యనారాయణ స్వామి చేతుల మీదుగా సంప్రదాయ పూజల అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని, ప్రభుత్వం పోషకాహారం, అన్ని వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ విశ్వరూప, ఆయా, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# రైతు బోరు కేబుల్ వైరు చోరీ.. ఆందోళనలో రైతు




**శివ్వంపేట, గంగాయిపల్లి: జూన్ 19,(మహాప్రభ)**
మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామంలో రైతు బోరుకు సంబంధించిన కేబుల్ వైరు చోరీ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పద్మచారి వ్యవసాయ బోరుకు అమర్చిన సుమారు 8 మీటర్ల కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చాటర్ డబ్బా (స్టార్టర్ బాక్స్) నుంచి అపహరించినట్లు రైతు పద్మాచారి తెలిపారు రైతు పద్మచారి తన వ్యవసాయ పొలానికి వెళ్లిన సమయంలో బోరు వద్ద కేబుల్ వైరు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సాగు పనులు కీలక దశలో ఉన్న సమయంలో కేబుల్ వైరు చోరీ కావడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇటీవల వ్యవసాయ మోటార్లు, కేబుల్ వైరులు లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న చోరీల కారణంగా రైతులు భయాందోళనలకు గురవుతున్నారని గ్రామస్థులు తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సామగ్రి చోరీలు పెరుగుతుండటంతో రైతులు తమ బోర్లు, మోటార్లు, కేబుల్ వైరుల భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# నిరుద్యోగుల పక్షాన పోరాటం కొనసాగుతుంది

**-ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించిన నిరుద్యోగ యువత.**



**గడ్డి అన్నారం 19 జూన్ (మహాప్రభ)**
రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం నిరుద్యోగ యువత చేపడుతున్న పోరాటానికి మద్దతుగా, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత ప్రతినిధులు ఈరోజు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువతకు ఇచ్చిన లక్ష ఉద్యోగాల హామీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యం కారణంగా యువత ఆందోళన వ్యక్తం చేస్తూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమ బాట పట్టారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత తమ సమస్యలను, ఉద్యోగ నియామకాల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎంపీ ఈటల రాజేందర్ కి వివరించారు. యువత విన్నపాలను శ్రద్ధగా ఆలకించిన ఆయన, నిరుద్యోగుల ఆందోళన వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే యువత తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం కావడానికి కృషి చేస్తానని తెలిపారు. బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారి ఆశలను వమ్ము చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ అద్వర్యం లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




**మెదక్ జిల్లా - 19జూన్(మహాప్రభ)**
కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెదక్ కాన్సెన్సీలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు రాహుల్ గాంధీ ఫ్లెక్సీ వద్ద కేక్ కట్ చేయించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఎ లీడర్ ట్రాన్స్ఫర్మ్స్ విజన్ ఇంటు రియాలిటీ అనే నినాదంతో వేసిన బ్యానర్ ముందు కార్యక్రమం జరిగింది. రాహుల్ గాంధీ గారి ఆలోచనలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న పోరాటాన్ని ఎమ్మెల్యే కొనియాడారు. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ: 'రాహుల్ గాంధీ యువతకు ఆదర్శం. ఆయన విజన్ ను మనం గ్రౌండ్ లెవల్ లో రియాలిటీ గా మారుద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత బస్ ప్రయాణం అన్నీ రాహుల్ స్ఫూర్తితోనే అమలవుతున్నాయి. రాహుల్ కి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నా" అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల అధ్యక్షులు, సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీ కి జేజేలు పలికారు. అనంతరం అందరికీ లడ్డూలు పంపిణీ చేశారు.

# నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**-ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్**



**దేవరకొండ జూన్ 19( మహా ప్రభ)**
కొండమల్లేపల్లి మండలం గుర్రపుతండ గ్రామ పంచాయతీ పరిధిలో రామావత్ పుల్లి-బిచ్చు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గృహప్రవేశ వేడుకలో ప్రత్యేక పూజల్లో పాల్గొని నూతన గృహంలో సుఖశాంతులు, ఐశ్వర్యం నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని కేశ్య తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ రామావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని పేర్కొన్నారు. చాలామంది రోడ్డు ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలు కావడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. వాహనదారులు అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. కుటుంబ సభ్యులు సురక్షితంగా ఇంటికి చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను జీవితంలో భాగంగా చేసుకోవాలి

## డిండి మండల పోలీస్ స్టేషన్లో "వన మహోత్సవం" కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ జూన్ 19( మహాప్రభ )**
నల్లగొండ జిల్లా డిండి మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన "వన మహోత్సవం" కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మొక్కలు నాటారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం హరిత తెలంగాణ లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరిన ఎమ్మెల్యే, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మరియు ప్రజా ప్రదేశాల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా డిండి సర్కిల్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో పోలీస్ శాఖ కూడా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోందని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిండి సర్కిల్ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నీట్ (యూజీ) 2026 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి.


**అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.**
**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా,-19జూన్ (మహాప్రభ )**
జిల్లాలో ఈ నెల 21న (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.
జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 01 పరీక్షా కేంద్రాశీలో మొత్తం 481మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.
ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.
అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి:
ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు
ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు.
రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో.
పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్ మాత్రమే అని అన్నారు.
**పాటించాల్సిన సూచనలు:**
అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలని.
పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలన్నారు.
**నిషేధిత వస్తువులు:**
స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు,
ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదని.
అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం , బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దన్నారు.
పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని/ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.
పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు.
అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.నీట్ (యూజీ)--2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.
అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష కోసం పోలీస్ శాఖ నుండి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డీఓ రమాదేవి , డీఎస్పీ ప్రసన్నకుమార్ సంబంధిత రెవిన్యూ, పోలీస్, వైద్య, తపాలా, విద్యుత్, ఆర్టీసీ, రవాణా, ఎడ్యుకేషన్, వారు పాల్గొన్నారు

# చదువే భవిష్యత్‌కు బంగారు బాట

**-ప్రతి చిన్నారి బడిబాట పట్టాలి - ఎంఈఓ శంకర్.**




**మెదక్ జిల్లా -19జూన్ (మహాప్రభ )**
చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత స్థానం లభిస్తాయని మెదక్ ఎంఈఓ శంకర్ అన్నారు. మెదక్ పట్టణంలోని ఫతేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం విద్యా వేడుకగా మారింది. చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ, విద్య అనేది వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిని కూడా ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్య అందించాలని పిలుపునిచ్చారు.అక్షరాభ్యాసంతో ప్రారంభమయ్యే విద్యా ప్రయాణం ఉన్నత శిఖరాలకు చేర్చగలదని ఆయన అన్నారు. చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.శ్రీ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు. సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలు, దేశభక్తి ప్రదర్శనలతో చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమణి, గౌస్ ఖురేషీ, ప్రధానోపాధ్యాయుడు దేవాజీ దేవాజీ అశోక్, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజినెస్

## రికార్డు సృష్టించిన జియో..

**తొలిసారి రూ.30వేల కోట్ల ప్రాఫిట్**




2025-26 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ జియోకు రూ.30,000 కోట్ల ఆదాయం సమకూరినట్లు జియో ప్లాట్ ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాష్ అంబానీ తెలిపారు. శనివారం జరిగిన రిలయన్స్ 49వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జియో చరిత్రలో తొలిసారి పన్నుల తర్వాత లాభం రూ.30 వేల కోట్లు దాటిందని, ఇది ఒక కొత్త రికార్డు అని పేర్కొన్నారు. ప్రస్తుతం జియో వినియోగదారుల సంఖ్య 52.4 కోట్లకు చేరిందని, దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్ గా జియో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందని ఆయన తెలిపారు.

## భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్..

### సెన్సెక్స్ 600 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. వరుసగా ఐదు సెషన్లలో లాభాలు పొందిన స్టాక్ మార్కెట్ శుక్రవారం నష్టాల బాటలో నడిచింది. సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 607.08 పాయింట్లు (0.78%) నష్టపోయి 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 155.05 పాయింట్లు (0.64%) నష్టపోయి 24,013.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో బీఎస్ఈ సెన్సెక్స్ 940.26 పాయింట్లు నష్టపోయి 76,469.72 కనిష్టానికి చేరింది.గ్లోబల్ ఐటీ దిగ్గజ కంపెనీ యాక్సెంచర్ ప్రకటించిన త్రైమాసిక ఫలితాలు నిరాశాజనకంగా ఉండటం, గతంలో ప్రకటించిన 5 శాతం రెవెన్యూ వృద్ధి అంచనాలను 4 శాతం తగ్గించడం మారట?్కట్‌లో ఐటీ షేర్ల పతనానికి దారితీసింది. యాక్సెంచర్ ప్రకటనతో దేశీయ ఐటీ




షేర్లు భారీగా నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.65 శాతం పతనమైంది. అమెరికా మార్కెట్లో యాక్సెంచర్ షేర్లు 18 శాతం పతనమయ్యాయి. భారతీయ ఐటీ కంపెనీలకు సంబంధించి ఇన్ఫోసిస్ 6.5 శాతం, టీసీఎస్ 3.06 శాతం, టెక్ మహీంద్రా 2.3 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.23 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.28 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలో ఎటర్నల్, పవర్ గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, టైటాన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, ఐటీసీ, ట్రెంట్, ఎల్ అండ్ టీ షేర్లు లాభాలు పొందాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యునీలీవర్ సంస్థలు నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి, 94.33 వద్ద కొనసాగింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం కుదరడం, హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో చమురు ధరలు 1 శాతం పైగా పతనమయ్యాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 78.33 డాలర్లుగా, డబ్ల్యూటీఐ (వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్) క్రూడాయిల్ ధర కూడా 1 శాతం పైగా తగ్గి 75.88 డాలర్ల వద్ద కొనసాగింది.

## ఒక్కసారి చార్జ్ చేస్తే 170 కిలోమీటర్లు ఆగేదే లేదు..
## ప్రతీ నెలా రూ.3 వేలు ఆదా..

పెట్రోల్, డీజిల్ ధరలు నానాటికి పెరుగుతుండటంతో.. సామాన్యులపై భారం పడుతుంది. ప్రతీ నెలా రూ.3 వేల వరకు ఇంధనంపై ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆర్థిక పరిస్థితి బాలేక ఇబ్బందులు పడే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇది పెద్ద భారమనే చెప్పుకోవాలి. దీంతో ఇటీవల కాలంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు. వీటి వల్ల ఇంధనంపై పెట్టు ఖర్చు తగ్గుతుంది. తక్కువ ధరలోనే ఈవీ వెహికల్స్ మార్కెట్లో లభిస్తున్నాయి. దీంతో పెట్రోల్ డబ్బులు ఆదా చేసుకునేందుకు వీటిని కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఉన్న డిమాండ్ దృష్ట్యా కంపెనీలన్నీ ఈవీ వాహనాలను మార్కెట్లోకి లాంచ్ చేస్తున్నాయి. తక్కువ ధరలో ఎక్కువ మైలేజ్ వచ్చే ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఒక్కసారి ఛార్జ్ చేస్తే రయ్.. రయ్**



ఓలా S1X ఎలక్ట్రిక్ స్కూటర్ గురించి ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే 176 కిలోమీటర్ల రేంజ్‌ను అందిస్తోంది. ఇక ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సిటీ రోడ్లపై 110 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేస్తుంది. అదే మీరు సిటీలో రోజూ 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంటే.. మూడు రోజులకు ఒకసారి ఛార్జ్ చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం పెట్రోల్ వెహికల్‌కు కిలోమీటర్లకు రూ.2 నుంచి రూ.2.5 ఖర్చు అవుతుంది. మీరు రోజూ 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంటే నెలకు రూ.3 వేలు ఖర్చు అవుతుంది. ఎలక్ట్రిక్ వెహికల్ వాడితే కిలోమీటర్‌కు 20 నుండి 30 పైసలు మాత్రమే ఖర్చు అవుతుంది. ఇక పెట్రోల్ వెహికల్ ఉంటే ఇంజిన్ ఆయిల్ మార్చడం, ఎయిర్ ఫిల్టర్ క్లీన్ చేయడం, క్లచ్ ప్లేట్లను గ్రైండింగ్ చేయడం లాంటి వాటికి అదనపు ఖర్చు అవుతుంది. అదే ఈవీ వాహనాలకు లాంటి ఖర్చు ఏమీ ఉండదు. రూ.లక్షలోపు ధరలోనే ఈ వెహికల్ లభిస్తుంది. ఇదే వేరియెంట్‌తో ఇతర కంపెనీల వెహికల్ ధరలు రూ.లక్షపైనే ఉన్నాయి. కానీ ఓలా రూ.లక్షలోపే ధరలో ప్రీమియం ఫీచర్లను అందిస్తోంది. ఇది హైస్పీడ్ వెహికల్ కావడంతో స్పీడ్ కూడా వెళ్లవచ్చు.

## ఐపీఎల్ 2027 షెడ్యూల్ లో మార్పు?

తీవ్రమైన ఎండలు, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఐపీఎల్ 2027 షెడ్యూల్‌లో కీలక మార్పులు చేయాలని బీసీసీఐ భావిస్తోంది. టోర్నీని రెండు వారాలు ముందే, అంటే మార్చి 10 నుంచి మే 15 మధ్య నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే ఆలోచన ప్రస్తుతానికి లేదని, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల వల్ల రెండు నెలల విండోను విస్తరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) షెడ్యూల్‌లో కీలక మార్పు చేయాలని భావిస్తోంది. 2027 సీజన్ నుంచి టోర్నమెంట్‌ను కాస్త ముందుగానే ప్రారంభించాలని యోచిస్తోంది. ఎండలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల ఆటగాళ్లు, అభిమానులు ఇబ్బంది పడటంతో పాటు.. మ్యాచ్ నిర్వహణ కూడా కష్టంగా మారుతోందని బీసీసీఐ భావిస్తోందట. అందుకే కాస్త ముందుగానే సీజన్ ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా అయితే మార్చి చివరి నుంచి మే చివరి వరకు ఉండే ఐపీఎల్ షెడ్యూల్



ఉంటుంది. ఐపీఎల్ 2026 షెడ్యూల్ సైతం.. మార్చి 28న మొదలై, మే 31 వరకు కొనసాగింది. దానిని ఇకపై మార్చి 10 నుంచి మే 15 మధ్యకు మార్చేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు సాగితే 2027 ఐపీఎల్ సీజన్.. మార్చి రెండో వారంలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.దేశంలోని అనేక ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రుతుపవనాల రాకకు ముందు కురిసే వర్షాల కారణంగా ఐపీఎల్‌లో చివరి మ్యాచ్‌లు ప్రభావితం అవుతున్నాయని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. "ఈ సంవత్సరం ఐపీఎల్ మార్చి 28న మొదలై మే 31 నాటికి ముగిసింది. అయితే, మే 15 తర్వాత టోర్నమెంట్ చివరి దశలో వర్షాలు పడే లేదా రుతుపవనాల సీజన్ మొదలయ్యే అవకాశం ఉందనే ఆందోళన ఉంది. మరోవైపు, తీవ్రమైన వేడి వాతావరణం ఆటగాళ్లకు గానీ, ప్రేక్షకులకు గానీ అనుకూలంగా ఉండదు. అందుకే టోర్నీని 2 వారాలు ముందే ప్రారంభించాలని బోర్డు భావిస్తోంది. దీనిపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో చర్చ జరుగుతోంది" అని బీసీసీఐ కార్యదర్శి తెలిపారు."ప్రస్తుతానికైతే ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెంచడం అనేది సాధ్యం కాదు. 74 మ్యాచ్‌ల ఫార్మాట్‌ను విస్తరించే ప్రణాళికలు ఇప్పుడు లేదు. ఎందుకంటే వివిధ దేశాల నుంచి వచ్చే ఆటగాళ్లకు సంబంధించిన అనేక అంశాలను మనం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎంతో కష్టపడితేనే ఐపీఎల్ కోసం రెండు నెలల విండో దొరుకుతోంది. అంతకుమించి ఎక్కువ సమయం కేటాయించడం అనేది చాలా కష్టం. ఎందుకంటే ఇతర దేశాలు కూడా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాల్సి ఉంటుంది. బట్టి, మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే విషయంపై ప్రస్తుతం ఎలాంటి చర్చా జరగట్లేదు" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు.

## టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో



సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు.దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు.2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.

# స్పోర్ట్స్

## అతడు మరో నాలుగేండ్లు ఆడుతాడు..

**-తేల్చి చెప్పిన ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్**




ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుది విడదీయరాని బంధం. 2008 లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ఒకే ఫ్రాంచైజీ తరఫున 19 సీజన్లలో ఆడిన ఏకైక ఆటగాడిగా ఈ బ్యాటింగ్ దిగ్గజం నిలిచాడు. తాను జట్లు మారే ప్రణాళికలు లేవని, తన ఐపీఎల్ కెరీర్‌ను ఆర్సీబీతోనే ముగించాలనుకుంటున్నానని కోహ్లీ పలు సందర్భాల్లో స్పష్టం చేశాడు. ఆర్సీబీ అభిమానులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను నిజం చేస్తూ వరుసగా గత రెండు సీజన్‌లో ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకోవడం ద్వారా ఆర్సీబీ తమ టైటిల్ కరువును తీర్చుకుంది.ఈ క్రమంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ భవిష్యత్తుపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీఈఓ రాజేశ్ మీనన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ మరో 3 నుంచి 4 ఏళ్ల పాటు ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫునే ఆడతారని ఆయన స్పష్టం చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా కోహ్లీ ఫ్రాంచైజీతో కొనసాగుతారని పేర్కొన్నారు. అతను పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. ఆట పట్ల అతనికి ఉండే తపన ఏమాత్రం తగ్గలేదు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అతనిలో కనిపించిన ఉత్సాహం చూస్తుంటే మరికొంత కాలం ఆడేందుకు ఎలాంటి సమస్యా ఉండదని ఆయన స్పష్టం చేశారు. అనుభవజ్ఞుడైన విరాట్ లాంటి బ్యాటర్ జట్టుకు ఎంతో ఉపయోగకరమన్నారు.

# ధనుష్ తాజా చిత్రం ఓం




తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి




అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్ట్స్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణా సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# స్పీడ్ పెంచిన టాలీవుడ్ చందమామ..

## కాజల్ అగర్వాల్ నయా మూవీ పోస్టర్ అదుర్స్

జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లతో ఆసక్తిని పెంచిన చిత్రబృందం, తాజాగా విడుదల చేసిన ఈ పోస్టర్‌తో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయవాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా చూపించింది. .ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారతదేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాంశం. సాధారణ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది. దర్శకుడు చెట్టన్ డీకే మాట్లాడుతూ, "ఆహార కల్తీ కారణంగా కుటుంబ సభ్యులు, కావాల్సిన వారిని కోల్పోయిన ప్రతి భారతీయుడి కథే 'ది ఇండియా స్టోరీ'. మన సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్నప్పటికీ అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఆహార కల్తీ ఒకటి. ఇది మనందరి రోజువారీ జీవితాలను ప్రభావితం చేసే అంశం. ఈ సినిమా ద్వారా ఈ దాగి ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందుకు తీసుకురావడంతో పాటు, దీనిపై ఒక ముఖ్యమైన చర్చకు నాంది పలకాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చాం. ఈ చిత్రంలో ఉన్న బలమైన సందేశం ప్రతి ఒక్కరికీ కళ్లు తెరిపించేలా ఉంటుందని, అలాగే ప్రతిరోజూ తాము తీసుకునే ఆహారం విషయంలో మరింత అవగాహనతో ఉండేలా ప్రేరేపిస్తుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

# 'కల్కి-2'లో కీలక పాత్ర?



కల్కి 2' షూటింగ్ భాగ్యనగరంలో గప్‌చుప్‌గా జరిగిపోతున్నది. ప్రభాస్ లేని సన్నివేశాలను దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. అలియాభట్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారట. ప్రస్తుతం ఆమెకు చెందిన సన్నివేశాలనే నాగ్‌అశ్విన్ చిత్రీకరిస్తున్నట్టు తెలిసింది. 'కల్కి 2898ఏడీ'లో దీపికా పదుకోన్ పోషించిన 'సుమతి' పాత్రనే 'కల్కి2'లో అలియా పోషిస్తున్నదనే గాసిప్పులు సోషల్ మీడియాలో జోరందుకున్నాయి. అయితే.. తాజాగా అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అలియా పోషిస్తున్నది 'సుమతి' పాత్ర కాదంట. కథను కీలకమైన మలుపు తిప్పే అత్యంత ప్రాధాన్యత గలిగిన ఓ సరికొత్త పాత్రలో అలియా కనిపిస్తారట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పనిమీద అలియా హైదరాబాద్‌లోనే ఉన్నారని వినికిడి. ఇక 'కల్కి 2898ఏడీ'లో దీపిక పోషించిన 'సుమతి' పాత్రకు సాయిపల్లవిని ఎంపిక చేసినట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు రావాల్సివుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com